

వైరా నది పాలైన
రూ.కోట్ల నిధులు

- నదిలో కలిసిపోనున్న పిల్లర్లు
- పక్కనే కొత్తగా హైలెవల్ వంతెన నిర్మాణం

7



ఖమ్మంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేయాలి

- నేడు 10 నిమిషాలు విద్యుత్ లైట్లను ఆర్పడం ద్వారా నిరసన
- వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు

6



పూసుకుంటలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

కొండరెడ్ల అభ్యున్నతికి కృషి

- పూసుకుంటలో మౌలిక వసతులు కల్పిస్తాం
- రోడ్లతోనే అభివృద్ధి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పూసుకుంటలో బ్రిడ్జీలకు ప్రారంభోత్సవం

6



సుర్దేపల్లిలో సదస్సులో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

రైతులకు చుట్టం.. భూ భారతి చట్టం

- రైతుల భూ సమస్యలన్నింటికీ పరిష్కారం
- దోచుకోవడానికే 'ధరణి'
- త్వరలో 4 వేల మంది సర్వేయర్లకు శిక్షణ
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

6



ఆన్‌లైన్‌లో వివరాలు చూసుకుంటున్న కూతురు, తండ్రి

ఎప్‌సెట్ పరీక్షలు ప్రారంభం

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి ఎప్‌సెట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనాయి. జిల్లావ్యాప్తంగా ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2,459 మందికి 2,321 మంది హాజరయ్యారు. 138 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలను టీసీఎస్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పద్ధతిలో, రెండు సెషన్‌లలో నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల (మిగతా 6వ పేజీలో)



డీఈవోగా ఎస్.సత్యనారాయణ

- ప్రస్తుతం డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు
- ఎఫ్ఏసీతో నియామకం

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారిగా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ నియమితులయ్యారు. పూర్తి అదనపు బాధ్యతల(ఎఫ్ఏసీ)తో ఆయనను నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంగళవారం (మిగతా 6వ పేజీలో)



వారి రూటే సప'రేటు'..

ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొందరు పోలీసు అధికారుల దందాలు

- చిట్టీల నుంచి సివిల్ కేసుల వరకు అంతా వారే..
- సెటిల్‌మెంట్‌లో రూ.12కోట్ల విలువైన స్థలానికి ఎసరు
- సివిల్ కేసుల్లో తలదూర్చడంలో అత్యుత్సాహం
- పోలీసింగ్ కన్నా ముడుపులు లాగడంపైనే ప్రధాన దృష్టి
- రోజు రోజుకూ మసకబారుతున్న పోలీసుశాఖ ప్రతిష్ట

ఖమ్మం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో కొందరు అధికారుల వ్యవహారశైలి.. ఆ శాఖ ప్రతిష్టను దిగజార్చే విధంగా ఉంటోందన్న విమర్శలున్నాయి. డివిజన్ స్థాయి అధికారులు కూడా ఇందుకు తీసిపోలేదు. పోలీసు శాఖపై ఆరోపణలు రావడం సహజమే అయినా, అందుకు కారణం మాత్రం దందాల స్థాయి మితిమీరిపోవడమేననే అభిప్రాయాలు వున్నాయి. 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన రెండు ప్రత్యేక కథనాలు పోలీసు శాఖలోని అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చిన విషయం విధితమే. ఆయా కథనాల్లో పేర్కొన్న అంశాలను చూసి కొందరు అధికారులు భుజాలు తడుముకుంటున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో అనేక రహస్య ఘట్టాలకు సంబంధించిన సమాచారం అందుతోంది. గతంలో కమిషనరేట్ పరిధిలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి ధనార్జనే ధ్యేయంగా పనిచేసి రూ. కోట్ల రూపాయలు వెనకేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. మిగతా వ్యవహారాలన్నీ ఎలా ఉన్నా.. ఆస్తుల వ్యవహారాలు, ఆర్థికపరమైన లావాదేవీలకు సంబంధించి ఆయనకు పెద్ద ఎత్తున మామూళ్లు ముట్టాయన్న ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఇటీవల కాలంలో అదేస్థాయిలో ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు ఒకరిద్దరు డివిజన్‌స్థాయి అధికారులు. బాధితులకు న్యాయం చేస్తున్నామన్న అంశాన్ని చూపించి సంబంధంలేని వారిని కార్యాలయాలకు పిలిపించుకుని ఇష్టారీతిన మాట్లాడటం, ఇబ్బందులకు గురిచేసి వ్యవహారాన్ని సెటిల్ చేసేదిశగా అడుగులు వేయడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలున్నాయి. ఓ అధికారి పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ సమీపంలో భూ వివాదానికి సబంధించి విషయాన్ని సెటిల్ చేసి గజం రూ. లక్ష వరకు పలికే 120 గజాల స్థలాన్ని (రూ.12కోట్ల విలువ) కొట్టేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో కేసులో తన పక్క డివిజన్ అధికారి మధ్యవర్తిత్వంతో రూ. 10 లక్షల మామూళ్లు అందుకున్నారన్న ప్రచారం కూడా ఉంది. ఇలా అనధికారికంగా పెద్ద ఎత్తున నగదు కూడబెట్టారన్న ఆరోపణలు బోలెడన్ని. ఇక ఆయన పక్కన డివిజన్‌లో ఉన్న అధికారిపై సైతం అదేస్థాయిలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో అసలు పని పక్కనపెట్టి ఇలాంటి సివిల్ కేసులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించినవాటిపైనే ఎక్కువ దృష్టిపెట్టి (మిగతా 6వ పేజీలో)

నేడు డీజీపీ రాక..?

రాష్ట్ర డీజీపీ జితేందర్ బుధవారం ఖమ్మం రానున్నట్టు తెలిసింది. కమిషనరేట్ పరిధిలోని పలు అంశాలపైన ఆయన మధ్యాహ్నం అంతర్గత సమీక్ష నిర్వహిస్తారని సమాచారం అందింది. ఈ క్రమంలో పోలీసు శాఖలోని వివిధ విభాగాల అధికారులు నివేదికలు సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. అయితే డీజీపీ పర్యటనను ఖమ్మం పోలీసు అధికారులు అధికారికంగా ధృవీకరించ లేదు. ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకుంటున్న అవినీతి, అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు ప్రచురితమైన విషయం విధితమే. ఇవి డీజీపీ దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. కథనాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా డీజీపీ సమీక్ష ఉంటుందని తెలిసింది. దీంతో ఆయా అక్రమార్క పోలీసు అధికారుల్లో గుబులు రేగుతోంది.





మృతిచెందిన సుశీల, తరుణ్

గ్యాస్ లీకై మంటలు అంటుకొని..

- వృద్ధురాలు సహా బాలుడి మృతి
- మరో ముగ్గురు పిల్లల పరిస్థితి విషమం

తల్లాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండర్‌ను స్టౌవ్‌కు అమర్చే విషయంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం.. రెండు ప్రాణాలను బలిగొని తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో బాలుడు, వృద్ధురాలు దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు పిల్లల పరిస్థితి విషమంగా ఉంది. ఈ దుర్ఘటన ఖమ్మంజిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. మిట్టపల్లిలో నివాసం ఉడే తాపీ వర్కర్ గుత్తికొండ వినోద్‌కుమార్... ఇంట్లో వంటగ్యాస్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌ను తీసుకువచ్చాడు. రాత్రి సిలిండర్‌ను స్టౌవ్‌కు కనెక్షన్ ఇవ్వగా గ్యాస్ లీకైంది. దీంతో ఇంటిముందు (మిగతా 6వ పేజీలో)

రెండు కార్లు ఢీ

- ఒకరి దుర్మరణం... ఆరుగురికి గాయాలు
- క్షతగాత్రులలో ముగ్గురు దక్షిణ కొరియన్లు



గాయపడిన దక్షిణ కొరియన్లను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జూలూరుపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం ఉదయం భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామం వద్ద చోటుచేసుకుంది. క్షతగాత్రులలో దక్షిణ కొరియాకు చెందిన ముగ్గురు పర్యాటకులు ఉన్నారు. వివరాల్లోకెళితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం రామానుజగూడేనికి చెందిన వానపాకుల సాంబశివరావు(25) గత ఐదు సంవత్సరాలుగా తన భార్య శ్రీలతతో కలసి హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 27వ తేదీన తన మరదలు వివాహం ఉండటంతో భార్యతో కలసి ఈ నెల 26వ తేదీన హైదరాబాద్ నుంచి కారులో సాంబశివరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా (మిగతా 6వ పేజీలో)



సీఎం, తుమ్మల చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

అన్నదాతల ఆనందోత్సాహాలు

- మంచుకొండ ఎత్తిపోతల ద్వారా రఘునాథపాలెం మండలం చెరువుల్లోకి సాగర్ జలాలు
- ఎండిపోయిన చెరువులకు జలకళ
- సస్యశ్యామలం కానున్న వేలాది ఎకరాలు
- రేగులకుంట చెరువు వద్ద సంబురాలు జరుపుకొన్న రైతులు
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

6

పానీ పరేషానీ

- భద్రాద్రి ఇన్‌టెక్‌వెల్ వద్ద కనిష్ఠ స్థాయికి నీటిమట్టం
- ఎగువ నుంచి నీటి ప్రవాహం తగ్గడమే కారణం
- ఇన్‌టెక్‌వెల్‌లో 15 అడుగులు పేరుకుపోయిన సిల్ట్
- రేపటి నుంచి వారం పాటు పూడిక తీత పనులు
- నీటి సరఫరా తగ్గిస్తామంటున్న అధికారులు

భద్రాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ భాగం నుంచి నీటి ప్రవాహం తగ్గింది. దీంతో గోదావరి ఇన్‌టెక్‌వెల్‌లోకి నీరు సరిపడా రావడం లేదు. ఈ పరిస్థితుల్లో నీటిని పంపింగ్ చేసేందుకు కనీస నీటి మట్టం కరువైంది. ఈ క్రమంలో మే నెలలో భద్రాచలం పట్టణవాసులకు తాగునీటి సరఫరా చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ అధికారులు భవిష్యత్తులో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. ఇన్‌టెక్‌వెల్‌లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. పట్టణవాసులకు ప్రతి రోజు వారం రోజుల పాటు గతంలో కంటే తక్కువగా తాగునీరు సరఫరా చేస్తామని పేర్కొంటున్నారు.

నీటిమట్టం రెండు అడుగుల లోపే..

భద్రాచలం ఇన్‌టెక్‌వెల్ సమీపంలో గోదావరి నీటిమట్టం రెండు అడుగుల లోపే ఉందని మిషన్ భగీరథ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పట్టణానికి ప్రతి రోజు 6.5 ఎంఎల్‌డీ (మిలియన్ లాక్స్ లీటర్‌లు)ని 15 వేల తాగునీటి నల్లాలకు సరఫరా చేస్తారు. అయితే ప్రస్తుతం రెండు అడుగులలోపే నీరు ఉండటంతో ఇన్‌టెక్‌వెల్ వద్ద నీటిని తోడే ప్రాంతంలో నీటిమట్టం ప్రమాదకరస్థాయికి పడిపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. గోదావరి పరిసర ప్రాంతాలు ఇసుక తిన్నెలు, రాళ్ల గుట్టలతో దర్శనమిస్తున్నాయి. ఎగువ నుంచి నీటి విడుదల పెంచకపోతే మే నెలలో ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భద్రాచలం పట్టణంలోని గోదావరి నదీ తీరాన ఉన్న ఇన్‌టెక్‌వెల్ వద్ద కనిష్ఠస్థాయిలో నీటిమట్టం లేకపోవడం ఐదేళ్ల తరువాత ఇదే తొలిసారి. 2019లో జనవరి, మార్చి నెలల్లో ఇదే పరిస్థితి (మిగతా 6వ పేజీలో)

మాదక ద్రవ్యాల రవాణా నేరం

» రైల్వే ప్రయాణికులకు అవగాహన కల్పించిన ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల రవాణా నేరమని రైల్వే ప్రయాణికులకు కొత్తగూడెం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ అవగాహన కల్పించారు. మంగళవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) ఆవరణలో ప్రయాణికుల సామగ్రిని తనిఖీ చేశారు. ముఖ్యంగా వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికులు, రైళ్ల భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. అదేవిధంగా స్టేషన్‌లోకి మంటలు కలిగించే వస్తువులేవి తీసురాకుడదని ప్రయాణికులకు సూచించారు. స్టేషన్ ఆవరణలో అనుమానాస్పద వ్యక్తులను ఆరాతీశారు. భద్రాచలం రోడ్‌లోని ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడానికే ఈ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ సాయి, ఏఎస్ఐ స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

» ఏడాదిలోపే సమస్యలకు పరిష్కారం

» అవగాహన సదస్సులో కలెక్టర్, ఎమ్మెల్యే

భద్రాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతిని ప్రారంభించిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. భద్రాచలంలో మంగళవారం భూ భారతి చట్టం 2025పై జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా సంవత్సర కాలంలోనే పరిష్కరించుకోవడానికి భూ భారతి ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇది వరకు ఏ చిన్న భూ సమస్య తలెత్తినా కోర్టులను ఆశ్రయించే వారని, నేడు కోర్టులను ఆశ్రయించకుండానే షెడ్యూల్ ఏను ఏర్పాటు చేశామన్నారు. భూమి విలువ రూ.5 లక్షల్లోపు ఉన్న పక్షంలో ఆర్డీవో స్థాయి, ఐదు లక్షలకు పైగా ఉన్న పక్షంలో కలెక్టరుస్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం కల్పించమన్నారు. భూమి విషయంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి ఏడాదిలోపు పరిష్కారం దొరుకుతుందన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న కలెక్టర్ జితేష్‌వి పాటిల్

కలెక్టరుస్థాయిలో సమస్యను పరిష్కారం కాని పక్షంలో సీసీఎల్ఏకు ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి మండలంలో తహశీల్దారు, సబ్‌కలెక్టరు, సబ్ రిజిస్ట్రార్ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని అన్నారు.

బూర్గంపాడు సదస్సులో..

భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంగళవారం బూర్గంపాడులోని రైతువేదికలో ఈ చట్టంలోని కీలక అంశాల గురించి రైతులకు వివరించారు. ఈ చట్టం ద్వారా భూమి హక్కులు, రికార్డు భద్రంగా ఉంటాయని తెలిపారు. భూమి రికార్డులు భూ భారతిలో ప్రజలకు అందుబాటులో ఉంటాయని, హక్కుల పూర్తి రికార్డు పారదర్శకంగా ఉంటుందని వివరించారు. రికార్డులలో తప్పుల సవరణలు, వారసత్వంగా వచ్చిన భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, భూ సమస్యలకు ఈ చట్టం పరిష్కారం చూపుతుందన్నారు. రైతుల అందరి భూములకు భూదార్ నెంబర్లను కెటాయించి సరిహద్దులతో కూడిన చిత్ర పటాన్ని పట్టాదార్ పాస్ పుస్తకంలో పొందుపరచనున్నట్లు తెలిపారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి 2025 చట్టంతో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన, గిరిజనేతర రైతుల భూములకు భద్రత ఉంటుందని, ఏ రైతుకు అన్యాయం జరగదని ఆందోళనకు గురి కావద్దు అని అన్నారు. ఈ అవగాహప సదస్సులో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, ట్రైనీ కలెక్టర్ సౌరబ్‌శర్మ, ఏడీఏ తాతారావు, తహశీల్దార్ ముజాహిద్, ఏంపీడీవో జమలా రెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్ తహశీల్దారు శ్రీనివాసరావు ఇతరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్వేషంతో, అహంకర పూరిత ధోరణితో వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా ఆల్ ఇండియా ముస్లీం పర్సనల్ లా బోర్డ్ ఖమ్మం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో కుల, మతాలకు అతీతంగా నిరసనల పర్వాన్ని ఉధృతం చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగా జిల్లా ప్రజలు తమ తమ నివాసాలు, వాణిజ్య సముదాయాలలో బుధవారం రాత్రి 9 గంటల నుంచి 9:10 నిమిషాల వరకు స్వచ్ఛందంగా విద్యుత్ లైట్లు నిలిపివేసుకోని నిరసన తెలుపాలని కోరారు. మంగళవారం నగరంలోని టీఎన్‌జీఓ ఫంక్షన్ హాల్లో ఆల్ ఇండియా ముస్లీం పర్సనల్ లా బోర్డ్ ఖమ్మం యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశానికి అఖిలపక్ష రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు ముస్లీం లా బోర్డ్ జేఏసీ నాయకులు మౌలానా మొహమ్మద్ సయిద్ అహ్మద్ ఖాస్మీ, ఇల్యాస్, అజరుద్దీన్, షేక్ అబ్దుల్ రషీద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పూవాళ్ళ దుర్గా ప్రసాద్, సిపిఎం ఖమ్మం కార్యదర్శి వై. విక్రమ్, బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల. నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మచ్చా వెంకటేశ్వర్లు, , సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి గోగినెపల్లి. వెంకటేశ్వర్లు, ఎంఎల్ పార్టీ కార్యదర్శి మధు, సేవాలాల్ సేన అధ్యక్షుడు కిషన్‌నాయక్, మాలమహానాడు అధ్యక్షుడు కొట్టే. సుధాకర్ తదితరులు హజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ ముస్లీం మైనారిటీలు విన్నూతన నిరసనలు తెలపాలని, తక్షణమే వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని అన్నారు. అఖిలపక్ష రాజకీయ పార్టీల, ప్రజాసంఘాలు ఏకమై ఐక్య న్యాయ పోరాటాలతో హక్కులు సాధించుకుంటామని కేంద్రాన్ని హెచ్చరించారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్మికులు అనేక ఉద్యమాలు, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కుల్ని కాలరాస్తోందని బీజేపీయేతర కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమావేశమయ్యారు. మే 30న అఖిల భారత సమ్మెపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.సూర్యం మాట్లాడారు. ఎన్నో త్యాగాలతో ఏర్పడిన కార్మిక చట్టాలను ఒక్క కలం పోటుతో రద్దు చేస్తే సహించేది లేదన్నారు. కార్మికులకు భద్రత లేకుండా భవిష్యత్‌లో కనీసం పని కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాంసింగ్, కార్మిక సంఘాల బాధ్యులు గాదె లక్ష్మీనారాయణ, నరాల నరేశ్, విష్ణువర్ధన్, వెంకటరెడ్డి, వెంకన్న, తోట రామాంజనేయులు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి.రామయ్య, నీలం రాజేష్, గుగులోత్ పటేల్ తదితరులున్నారు.


సొసైటీ కార్యాలయం వద్ద గన్నీసంచుల కోసం గుమిగూడిన రైతులు

సొసైటీ గన్నీసంచులు తీసుకెళ్లిన రైతులు

వైరా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు సొసైటీ కార్యాలయంలో సిబ్బందిని నిర్బంధించి రైతులు గన్నీసంచులు తీసుకెళ్లిన సంఘటన మంగళవారం జరిగింది. సొసైటీ కార్యాలయానికి పదివేల గన్నీసంచులు వచ్చినప్పటికీ అధికారుల ఆదేశాల మేరకు వాటిని ఇవ్వబోమని సొసైటీ సిబ్బంది చెప్పడంతో రైతులు తీవ్రంగా ఆగ్రహించారు. ఆ వెంటనే కార్యాలయంలో ఉన్న చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి, సీఈవో రామకృష్ణ, సిబ్బందిని నిర్బంధించారు. కొద్దిసేపటికే వారిని నిర్బంధం నుంచి వదిలేశారు. ఈ సొసైటీ పరిధిలోని దాచాపురం, గరికపాడు, లింగన్నపాలెం గ్రామాల్లో ఇప్పటి వరకు 52,885 ధాన్యం బస్తాలను కాంటా వేసి వాటిలో 40,557 బస్తాలను మిల్లులకు తరలించారు. ఇంకా 12,328 బస్తాలు ఐదురోజుల నుంచి రోడ్లు, కల్లాల్లోనే ఉన్నాయి. కాంటా వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించే వరకు రైతులెవరికి ఖాళీ గన్నీసంచులు ఇవ్వొద్దని జిల్లా అధికారులు తమను ఆదేశించారని చెపుతూ వాటిని ఇచ్చేందుకు నిరాకరించారు. తమ కళ్లెదుటే పదివేల గన్నీసంచులు ఉన్నప్పటికీ అధికారుల ఆదేశాలంటూ వాటిని ఇచ్చేందుకు నిరాకరించిన సొసైటీ సిబ్బందిని నిర్బంధించి రైతులు ఖాళీ గన్నీసంచులను తీసుకువెళ్లారు. ఒకవేళ గన్నీసంచుల విషయంలో అధికారులు ఏమైనా చర్యలు తీసుకుంటే తామంతా బాధ్యత వహిస్తామని రైతులు అక్కడున్న సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డికి, సిబ్బందికి భరోసా ఇచ్చారు. రోడ్లు, కల్లాల్లో రోజుల తరబడి ధాన్యం ఆరబోసి ఉన్నామని ప్రతిరోజూ గాలిదుమారం, భారీ వర్షాలతో తాము ఆందోళన చెందుతున్నామని, కనీసం ఆ ధాన్యాన్ని బస్తాల్లో నింపి కాంటా వేసి జాగ్రత్త పరుచుకుంటామని అందుకు సహకరించాలని రైతులు కోరారు. ఆ వెంటనే తమ అవసరాల మేరకు రైతులు ఖాళీ గన్నీసంచులను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

గ్యాస్ లీకై మంటలు అంటుకొని...

(5వ పేజీ తరువాయి)

మండుతున్న కట్టెలపొయ్యికి వ్యాపించి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వినోద్‌కుమార్‌తో పాటు అతడి నాయనమ్మ సుశీల, కవల కుమారులు తరుణ్, వరుణ్, మేనకోడళ్లు తొమ్మిదేళ్ల ప్రిన్సీ, ఐదేళ్ల లిమ్సీ తీవ్రంగా గాయపడ్డారు. మంటల్లో చిక్కుకున్న వారంతా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు వచ్చి మంటలను అదుపుచేసి 108వాహనానికి సమాచారం అందించారు. అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాగా, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు గుత్తికొండ సుశీల(70), హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుత్తికొండ తరుణ్(7) మృతిచెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరుణ్, ప్రిన్సీ వరుణ్, లిమ్సీ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం హైదరాబాదు తరలించారు. తీవ్రంగా గాయపడిన వినోద్‌కుమార్ ఖమ్మంలో చికిత్స పొందుతున్నాడు. మృతిచెందిన సుశీల.. వినోద్‌కుమార్‌కు నాయనమ్మ అవుతుంది. తరుణ్.. చిన్నకుమారుడు. కాగా, వినోద్ కుమార్ భార్య రేవతి ఘటన సమయంలో సరుకులు తేవడానికి దుకాణానికి వెళ్లడంతో ప్రమాదం నుంచి బయటపడింది. వయోవృద్ధురాలైన సుశీల తన మనవడు వినోద్‌కుమార్ ఇంట్లోని వరండాలో ఉంటూ జీవిస్తోంది. తానే స్వయంగా కట్టెలపొయ్యితో వంట చేసుకుంటుంది. సిలిండర్ లీకైన సమయంలో కట్టెలపొయ్యి మండుతుండడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఆమె కాలినగాయాలకు గురై ప్రాణాలో కోల్పోయింది.


ప్రమాదానికి కారణమైన సిలిండర్


రోదిస్తున్న బంధువులు

వినోద్‌కుమార్-రేవతి దంపతులకు ముగ్గురు మగపిల్లలు. వీరిలో తరుణ్, వరుణ్ కవలలు. నాలుగేళ్ల క్రితం మూడో కుమారుడు జన్మించి 4నెలల వ్యవధిలోనే మృతి చెందాడు. తరుణ్, వరుణ్‌లు స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి పూర్తి చేసి, వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో అగ్ని ప్రమాదంలో తరుణ్ మృతిచెందగా, వరుణ్ పరిస్థితి విషమంగా ఉంది. వేసవిసెలవులు కావడంతో సరదాగా గడపవచ్చని ఈనెల 26న మేనమామ వినోద్‌కుమార్ ఇంటికి రామానగరానికి చెందిన మేనకోడళ్లు గుంట్రు ప్రిన్సి, లిమ్సీ వచ్చారు. సోమవారం రాత్రి స్నానం చేసి దుస్తులు మార్చుకుంటున్న సమయంలో అగ్ని ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం హైదరాబాదు తరలించారు. కాగా, ఈ ఘటనపై వినోద్‌కుమార్ తల్లి గుత్తికొండ నిర్మల మాట్లాడుతూ రెక్కల కష్టంతో బతుకుతున్న తన కొడుకు కుటుంబంపై విధి పగబట్టిందని విలపించింది. ఈప్రమాదంలో అత్త సుశీ ల, మనుమడు తరుణ్‌ను కోల్పోయానని, మరో మనుమడు వరుణ్, ఇద్దరు మనుమరాళ్లు ప్రిన్సి, లిమ్సీ చావుబతుకుల మధ్య ఉన్నారని తెలిపింది.

పానీ పరేషానీ....

(5వ పేజీ తరువాయి)

గతంలో ఏర్పడింది. దీంతో ఆనాడు అధికార యంత్రాంగం ప్రత్యామ్యాయ చర్యలుగా గోదావరి ప్రవహిస్తున్న నీటికి ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసి నీటిని నిల్వ చేసి ప్రజలకు అందించారు. అలాగే ఇన్‌టెక్ వెల్‌లో సిల్టును సైతం తొలగించే పనులు నిర్వహించారు.

పూడిక తీత పనుల క్రమంలో ప్రజలు సహకరించాలి

మిషన్ భగీరథ డీఈ ఏసుబాబు

ఇన్ టెక్‌వెల్ లోపలి భాగంలో సిల్టు 15 అడుగుల మేర పేరుకుపోయింది. పూడికతీత పనులను చేపడుతున్న క్రమంలో గురువారం నుంచి ఏడో తేదీ వరకు పూడిక తీత పనులు ఉదయం చేపట్టనున్నాం దీంతో సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు మాత్రమే తాగునీటి సరఫరా ట్యాంకులకు ఉంటుంది. దీంతో 50 శాతం తాగునీటిని మాత్రమే భద్రాద్రి ప్రజలకు ఇవ్వడానికి అవకాశం ఉంది. ఇందుకు ప్రజలు సహకరించాలి. ప్రజలకు చోటు చేసుకున్న అసౌకర్యంకు చింతిస్తున్నామని ప్రజలు పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరారు.

కొండరెడ్ల అభ్యున్నతికి కృషి

దమ్మపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అడవితల్లినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న కొండరెడ్లను ఆధునిక సమాజంలో వారుకూడా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దమ్మపేట మండలం పూసుకుంట బీటిరోడ్ నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు రూ.4.18కోట్లతో నిర్మించిన మూడు బ్రిడ్జీలను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి తుమ్మల మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా పూసుకుంట గ్రామానికి రహదారి సౌకర్యంలేక వెనుకబాటుకు గురయ్యారని ఏప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రహదారి సౌకర్యం కావాలని అడివితల్లినే నమ్ముకొని జీవిస్తున్న కొండరెడ్లు.. అటవీ అడ్డంకులతో అభివృద్ధికి దూరమయ్యారని అన్నారు. పూసుకుంట రహదారి నిర్మాణం కోసం తాను 10 సంవత్సరాల క్రితమే నిధులు మంజూరు చేయగా ఆగిపోయిందని అన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు ప్రతినెల పూసుకుంట సందర్శించి సమస్యలు తెలుసుకొని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి కొండరెడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తుమ్మల ఆదేశించారు. రహదారి సౌకర్యం లేకపోవటంతో కొండరెడ్లు మౌలిక వసతులకు దూరమయ్యారని అన్నారు.

పూసుకుంట గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనలో అటవీ అధికారులు అడ్డంకులు సృష్టించవద్దని, సమస్యలను మానవీయ కోణంలో చూడాలన్నారు. యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చే విధంగా పోలీస్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో కొండరెడ్ల జీవనోపాధికి తీసుకుంటున్న చర్యలు వివరించారు. పామాయిల్ సాగుతో పాటు వెదరు, ములగ సాగు లాభదాయకుంగా ఉంటుందని అన్నారు. ములగ సాగు ఉపయోగాలు ఆదాయం వివరించారు. ఐటీడీఏ ద్వారా అభివృద్ధికి తీసుకున్న చర్యలు వివరించటంతోపాటు స్వయం ఉపాధి రాజీవ్ యువవికాసం ద్వారా చేయుత ఇవ్వనున్నట్లు తెలిపారు. జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తు ల కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఎన్నో ఏళ్లుగా పూసుకుంట గ్రామాభివృద్ధి తన హయాంలో జరగటం సంతోషానిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో పూసుకుంట అభివృద్ధికి హామీలు ఇవ్వటం జరగిందని మాట ప్రకారం మంత్రి తుమ్మల సహకారంతో జరగటం అభినందించదగ్గ విషయమన్నారు. పూసుకుంట, కటుకూరు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఏపీవో డేవిడ్‌రాజు, డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు చుట్టం.. భూ భారతి చట్టం

నేలకొండపల్లి,ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): రైతులకు చుట్టం. భూభారతి 2025 చట్టం అని రెవె న్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహనా సదస్సులో మంత్రి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ దేశంలోని 18రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను పరిశీలించి, మేధావులు, అధికారులు సలహాలు, సూచనలు తీసుకుని రైతులకు చుట్టమైన, వరంలాంటి భూభారతి చట్టాన్ని తెచ్చినట్లు చెప్పారు. ఇప్పటి వరకు అవగాహనా సదస్సుల్లో 23,080 దరఖాస్తులు వచ్చాయని, అందులో దాదాపుగా 40శాతం సాదా బైనామాలకు సంబంధించినవేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9.26లక్షల సాదా బైనామా దరఖాస్తులు ధరణిలో అవకాశం లేకపోవటం వలన ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ధరణితో వచ్చిన నష్టాన్ని పూ డ్చటానికి, లోపాలను సరిచేస్తూ భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. జూన్2 కల్లా నేలకొండపల్లిని భూసమస్యలు లేని వివాదరహిత మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ నాలుగు మం డలాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యలపై అధికారులకు అవగాహన కల్పించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ఒక్కొక్క మండలాన్ని పైలెట్ మండలంగా తీసుకుంటామన్నారు.

త్వరలో సర్వేయర్ల నియామకం....

10, 15రోజుల్లోనే 3వేల నుంచి 4వేల మంది సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి, లైసెన్సులిచ్చి, ప్రతి మండలానికి నలుగురి నుంచి ఐదుగురి వరకు సర్వేయర్లను పంపనున్నట్లు మంత్రి చెప్పారు. రెండో దశలో మూడు వేలమందికి శిక్షణ ఇస్తామన్నారు. ప్రస్తుతం 380 మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారని, మరో వెయ్యి మంది ప్రభుత్వ సర్వేయర్లను నియమించనున్నట్లు చెప్పా రు. దొర చెప్పిన పని చేయలేదని ఓఅర్ధరాత్రి 23వేల మంది రెవిన్యూ సిబ్బందిని దొర రోడ్డున పడేసాడన్నారు. వచ్చే నెల 17-18కల్లా 6నుంచి7వేల మంది సిబ్బందిని నియమిస్తామని, ప్రతి రెవిన్యూ గ్రామానికి రెవిన్యూ వ్యక్తులను పంపుతామని మంత్రి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అంతకు ముందు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఎప్పుడో 1930లో సర్వే చేసారని, తిరిగి ఇప్పటి వరకు భూములను సర్వే చేసిన దాఖలాలు లేవన్నారు.భూభారతిలో జీపీఎస్ టెక్నాలజీతో సర్వే చేసే అవకాశం ఉందన్నారు. త్వరలోనే గ్రామాల వారీగా లైసెన్సుడు సర్వేయర్లతో భూముల సర్వే చేయిస్తామన్నారు. భూభారతిలో పాస్‌పుస్తకంలో నక్షా పెట్టి ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సదస్సులో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎమ్మార్ఐ రవికుమార్, పాల్గొన్నారు.

అన్నదాతల ఆనందోత్సాహాలు

రఘునాథపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు మినహా మరో సాగునీటి ప్రత్యామ్యాయం లేని మండలం రఘునాథపాలెం. 95శాతం గిరిజన జనాభా కలిగి, ఆధునిక వ్యవసాయం, కూరగాయల సాగులో ఈ మండలానికి మంచి గుర్తింపు ఉంది. ఖమ్మం నగరానికి నిత్యం సరఫరా అయ్యే కూరగాయల్లో అధిక భాగం ఈ మండలం నుంచే సరఫరా అవుతుంది. ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ఖమ్మం ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో బుగ్గవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం చేసి రఘునాథపాలెం మండలాన్ని సస్యశ్యామలం చేయాలని కార్యాచరణ చేశారు. కానీ తర్వాత వచ్చిన ప్రభుత్వంలో అమలు కాలేదు.

ఈ క్రమంలో తుమ్మల 2023లో మరోసారి ఖమ్మం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి మంచుకొండ ఎత్తిపోతల పథకం గురించి వివరించారు. జనవరి 12న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి మంచుకొండ వద్ద ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయించారు. మూడు నెలల కాలంలోనే మంచుకొండ ఎత్తిపోతల పథకం పూర్తి చేశారు. రఘునాథపాలెం మండలంలోని 37 చెరువులకు సాగర్ జలాలను అందించేందుకు రంగం సిద్ధం చేశారు.

మంచుకొండ పోత్తిపోతల పథకం ద్వారా రఘునాథపాలెం మండలంలోని చెరువులకు సాగర్ జలాలు రావటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండే ఎండల్లో ఎండిపోయిన చెరువులు.. సాగర్ జలాలతో కళకళలాడుతుండటంతో సంబురాలు జరుపుకొంటున్నారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మండలం కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రేగుటకుంట చెరువు వద్ద సంబురాలు జరిపారు. సాగర్ జలాలు వచ్చే కాల్వ వెంట రైతులు, కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేస్తూ పూలు చల్లారు. రేగులకుంట చెరువు వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలతో అభిషేకాలు చేశారు.

గత ప్రభుత్వంలో గోతులు మిగిలాయి...

రేగులకుంట చెరువు వద్ద ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ ఆధ్వర్యంలో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువుల పూడికతీత పేరుతో అనేక అక్రమాలు చేశారని, కానీ చుక్క నీరు వచ్చే అవకాశం పరిశీలించలేదన్నారు. రైతే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా ఉండటంతో రైతుల బాగోగులు తెలుసుకున్నారని, అందుకే ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో బుగ్గవాగు ప్రాజెక్టు గురించి కార్యాచరణ చేశారని, ఇప్పుడు మంత్రిగా మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా రఘునాథపాలెం మండలాన్ని సస్యశ్యామలం చేస్తున్నారని పేర్కొన్నారు.

రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం మాట్లాడుతూ మంత్రి తుమ్మల చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ కేవలం 15 నెలల కాలంలోనే రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత మంత్రి తుమ్మలకే దక్కిందన్నారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ మాట్లాడుతూ రానున్న గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ జెండాలు ఎగరేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు వాంకుడోత్ విజయ, బండి వెంకన్న, దేవ్‌సింగ్ నాయక్, రామూర్తినాయక్, తమ్మినేని నాగేశ్వరరావు, బాతుల సుధాకర్ పాల్గొన్నారు.

వారి రూటే సప'రేటు'...

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనధికారిక చిట్టీల నుంచి మొదలుకుని అనధికారిక ఫైనాన్స్ వ్యవహారాల్లో గొ డవలపై బాధితులు వచ్చిన స్పందించకుండా ఉండేందుకుగాను భారీగానే ముడుపులు అందుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోస్టింగ్ ఓ చోట.. విధులు మరోచోట...

జిల్లాలో పనిచేస్తున్న సిబ్బందిలో కొందరు స్టేషన్ల నుంచి కదలడం లేదన్న వాదన ఎప్పటినుంచో కొనసాగుతోండగా.. ప్రస్తుతం ఏకంగా ఇద్దరు విభాగాల అధికారులనే మార్చడం వెనుక ఉన్న కారణాలేంటన్నది ప్రశ్నగా మారింది. కీలక విభాగానికి అధికారిక పోస్టింగ్ ఉన్న ఓ అధికారిని పక్కన పెట్టి.. ఆ స్థానంలో మరో అధికారితో పనిచేయించడం ఎందుకు అన్న విషయంపై ఎవరూ నోరు మెదపని పరిస్థితి. అంతేకాదు సదరు అధికారిని లా అండ్ ఆర్డర్‌తో సంబంధంలేని పోస్టు ఎందుకిచ్చారన్న అంశంపై కూడా ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఇక ఉన్నతాధికారులకు భరోసాగా ఉండేలా, శాఖలో క్రియాశీలకంగా పనిచేసే ఆ విభాగంలో ఉన్న అధికారిపై, ఆ విభాగంలో పనిచేస్తున్న మరికొందరు సిబ్బందిపై సైతం ఇలాంటి ఆరోపణలు రావడం కొసమెరుపు. ఇక పలు కేసుల్లో నగదు పోగొట్టుకున్న బాధితులకు భరోసాగా నిలవాల్సిన వారు కూడా బాధితుల నుంచే మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరికి వారు ఆరోపణలు అవాస్తవం అని కొట్టిపారేస్తున్నప్పటికీ ఏమి జరగకుండా ఇంత పెద్ద మొత్తంలో ఆరోపణలు ఎందుకొస్తాయనేది సామాన్యప్రజల్లో చర్చ జరుగుతోంది.


ఎప్‌సెట్ పరీక్షలు ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్ష సమయానికి గంట ముందు నుంచే విద్యార్థులను కేంద్రాలలోకి అనుమతించారు. కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లితండ్రులతో కోలాహలంగా మారింది. జిల్లాలోని సత్తుపల్లిలో రెండు పరీక్ష కేంద్రాలు, ఖమ్మం నగరంలో మూడు పరీక్ష కేంద్రాలు, ఖమ్మం రూరల్‌లో రెండు పరీక్ష కేంద్రాలలో, కొణిజర్ల మండలంలో ఒక పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భద్రాద్రి జిల్లాలో...

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలుగా కేటాయించగా, తొలి రోజు సుజాతనగర్ మండలంలోని అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. 260 మంది విద్యార్థులకు గాను 248 మంది అభ్యర్థులు హాజరయ్యారు.


ఖమ్మంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి


డీఈవోగా ఎస్.సత్యనారాయణ


(5వ పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విద్యాశాఖ అధికారిగా ఉన్న సోమశేఖర శర్మ బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. డైట్ కళాశాల అధ్యాపకుడిగా ఉన్న సోమశేఖర శర్మను ప్రభుత్వం మొదట భద్రాద్రి కొత్తగుడెం డీఈవోగా, 2023 డిసెంబరులో ఖమ్మం డీఈవోగా నియమించింది. బుధవారం ఆయన ఉద్యోగ విరమణ చేస్తుండటంతో ఖమ్మం డైట్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సత్యనారాయణను డీఈవో (ఎఫ్ఏసీ)గా నియమించారు. ఆయన బుధవా రం బాధ్యతలు స్వీకరించనున్నారు. కా గా సత్యనారాయణ ఈ ఏడాది జూలైలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. మూడు నెలలు మాత్రమే డీఈవోగా సేవలు అందించనున్నారు.

ఎదురెదురుగా

ఢీకొన్న రెండు కార్లు


ప్రమాదంలో గాయపడిన వారు


సాంబశివరావు(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

కుక్కునూరు మండలంలోని ఏలేరు గ్రామంలోని అత్తగారింటికి వచ్చారు. మరదలు వివాహ వేడుకలో పాల్గొని సాంబశివరావు భార్య శ్రీలత, మరో మరదలు సంధ్యను తీసుకుని కారులో ఏలేరు నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో దక్షిణ కొరియాకు చెందిన ముగ్గురు పర్యాటకులు హైదరాబాద్ నుంచి రాములోరిని దర్శించుకునేందుకు కారులో బయలుదేరి భద్రాచలం వెళుతున్నారు. వినోభానగర్ వద్ద రెండు ఈ కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాంబశివరావు, భార్య శ్రీలత, మరదలు సంధ్యలతో పాటు పర్యాటకులు కిమ్, షిన్, కిమ్‌లతో పాటు కార్ డ్రైవర్ దర్శన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాంబశివరావు పరిస్థితి విషమించి ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దక్షిణ కొరియాకు చెందిన ముగ్గురు పర్యాటకులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు.

అంజన్నకు అభిషేకం..

భద్రాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారి ఆలయ ఆవరణలో ఉన్న దాసాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు.

గిరిజన పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల లొల్లి

» నారాయణపురంలో సర్వేను అడ్డుకున్న గిరిజనులు » జమ్మిగూడెంలో అనర్హులకు కేటాయించారంటూ నిరసన

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల ఆందోళనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లను మంజూరు చేశారంటూ గిరిజన గ్రామాల్లో ధర్నాలు, ఆందోళన చేపట్టగా, తాజాగా మంగళవారం నారాయణపురం, జమ్మిగూడెంలో ఆందోళనలు జరిగాయి. నారాయణపురం పంచాయతీలో దాదాపు 50 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. మంజూరైన ఇళ్లను తిరిగి సర్వే చేసేందుకు అధికారులు మంగళవారం నారాయణపురం వచ్చారు. విషయం తెలుసుకున్న పంచాయతీ పరిధిలోని నెమలిపేట, సూరంపేట, జగన్నాధపురం గ్రామానికి చెందిన దాదాపు 200మంది గిరిజనులు పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. ఇష్టారాజ్యంగా అనర్హులకు ఇళ్లను ఎలా మంజూరు చేస్తారని, భూములు, ట్రాక్టర్లు ఉన్నవారికి కూడా ఇళ్లను ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇపుడు వచ్చిన జాబితాను పూర్తిగా రద్దు చేసి, తిరిగి ఇంటింటి సర్వేను జరిపి నిజమైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ఆందోళనతో అధికారులు సర్వే చేయకుండానే వెళ్లిపోయారు. నిజమైన పేదలకు ఇళ్లను మంజూరు చేయాలని అధికారులు, పాలకులను కోరారు. ఇక జమ్మిగూడెంలో 15మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. వీటిలో


ఇందిరమ్మ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న గిరిజనులు

నలుగురు అనర్హులు ఉన్నారని, పేదలకు మాత్రం ఇంటిని మంజూరు చేయలేదంటూ గ్రామస్థులు నిరసన చేపట్టారు. గ్రామంలో అనేకమంది పేదలు ఉన్నారని, ఏళ్లుగా ఇంటి కోసం ఎదురుచూస్తున్నా పేదలకు కాకుండా పెద్దలకు మంజూరు చేశారని అన్నారు. ఈమేరకు అధికారులకు వినతిపత్రం అందించామని గ్రామస్థులు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి


మంగమ్మ

మణుగూరు రూరల్, 29 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): వడదెబ్బ తగిలి వద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని దమ్మక్కపేట గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బిల్లా మంగమ్మ(78) గత నాలుగు రోజులుగా వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మణుగూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురై, మృతి చెందినట్లు కుమారులు తెలిపారు. పలు రాజకీయ పార్టీల నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు..


వీరస్వామి

కల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెం దిన సంఘటన మం డల పరిధిలోని ము గ్గువెం కటాపురం గ్రా మంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికుడిగా పని చేస్తున్న గంగ్ర వీరస్వామి(54) మంగళవారం ఉదయం తన స్కూటీపై కల్లూరుకు వస్తుండగా, మార్గ మ ధ్యలో కోతులను త ప్పించే క్రమంలో స్కూటీ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక..

దుమ్ముగూడెం ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజుబాక గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈనెల 22న తన ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. కాగా కొత్తపల్లికు చెందిన ఓ యువకుడితో ప్రేమ వ్యవహారంలో వచ్చిన సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో ఏఎస్ఐ


హన్మంతునాయక్

మరిపెడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మం డల కేంద్రంలోని పీఎస్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న హన్మంతునాయక్(58) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఖమ్మం జిల్లా బల్లెపల్లిలో నివాసం ఉంటున్న హన్మంతునాయక్ రోజులానే విధులకు హాజరయ్యేందుకు మరిపెడకు వస్తున్నక్రమంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామమైన గార్ల మండలం మర్రిగూడెంలో జరగనున్నాయి. మరిపెడ పీఎస్‌కు వచ్చేవారితో ఆత్మీయంగా పలకరించే ఏఎస్ఐ అకాల మరణం మండల ప్రజలను కలిచివేసింది.

రిటైర్డ్ ఎంఈవో...


శేషభూషణం

తల్లాడ, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో మంగళవారం రిటైర్డ్ ఎంఈవో బాజోజు శేషభూషణం(80) గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శేషభూషణం బంగారు వెండి నగల వర్తక సంఘం, తల్లాడ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా, రిటైర్డు ఉద్యోగుల సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన మృతికి సంతాపంగా తల్లాడలో బంగారు షాపులను స్వచ్ఛందంగా మూసివేశారు. శేషభూషణం మృతదేహాన్ని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు, జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య, జిల్లా కార్యదర్శులు సుబ్బయ్య, వేణు, రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ బొంతు సమత, బొంతు రాంబాబు, సోమేశ్వరచారి, నర్సింహాచారి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

నకిలీ టీఆర్‌లపై విచారణ

సీసీఐకి టోకరాపై క్షేత్రస్థాయిలో పరిశీలన

అశ్వాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నకిలీ టీఆర్(తాత్కాలిక రిజిస్ట్రేషన్)ల అంశం ఇంకా ప్రకంపనలు సృష్టిస్తూనే ఉంది. నకిలీ టీఆర్‌లకు సంబంధించి గత రెండు రోజులుగా మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో పత్రాలను వరంగల్ విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో రైతులను కలసి క్షేత్రస్థాయిలో విచారణ జరిపినట్లు సమాచారం. కాగా నకిలీ టీఆర్‌లతో గత ఫిబ్రవరి నెలలో కొందరు దళారులు, వ్యాపారులు సీసీఐకి టోకరా వేశారు. ఈవిషయంపై అప్పట్లో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణతో పాటు, విజిలెన్స్ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవ్యవసాయ విస్తరణాధికారి కలర్ జీరాక్స్‌లతో నకిలీ టీఆర్‌లను కొందరు వ్యాపారులకు, రైతులకు ఇచ్చిన విషయం వెల్లడైన సంగతి తెలిసిందే. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు నకిలీ టీఆర్‌ల అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని ఇటీవల వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయి విజిలెన్స్ విచారణ చేపట్టారు. రామచంద్రాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులను విచారించిన విజిలెన్స్ అధికారులు అసలు రైతు, కౌలు రైతు ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు. ఎక్కడ సీసీఐలో విక్రయించారు. టీఆర్‌లు ఎవరు జారీ చేశారు, సొమ్ము ఎవరి ఖాతాలో జమ అయ్యింది అనే అంశాలపై రైతుల నుంచి సమాచారం సేకరించినట్లు తెలిసింది.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితి కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్ తదితర కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం హైదరాబాద్‌కు చెందిన సెట్విన్ సంస్థ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వనుందని పేర్కొన్నారు. మే 1 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని తెలిపారు. దరఖాస్తులు అందించేందుకు, సమాచారం కోసం సర్దార్ పటేల్ స్టేడియంలోని సెట్‌కం కార్యాలయంలో నేరుగా, 9948207271 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

పీపీటీ టాలెంట్ టెస్ట్ దరఖాస్తులకు నేడే ఆఖరు

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పీపుల్స్ ప్రొగ్రెసివ్ ట్రస్ట్ (పీపీటీ) ఆధ్వర్యంలో టీఎస్ యూటీఎఫ్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు 4,5,6 తరగతుల ప్రవేశాలకు విద్యార్థులకు మే5న ఉదయం 10 గంటలకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు తెలిపారు. దరఖాస్తులకు నేడు ఆఖరని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో తల్లిదండ్రులులేని పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్న సంస్థ పీపీటీ అని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు ఉచిత వసతి, విద్యను అందిస్తుందని తెలిపారు.

వైరా నది పాలైన కోట్ల రూపాయల నిధులు


కొత్తగా జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

» నదిలో కలిసిపోనున్న హైలెవల్ వంతెన ఫిల్లర్లు
» పక్కనే కొత్తగా హైలెవల్ వంతెన నిర్మాణం

వైరా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవ లేదనే రీతిలో తొమ్మిదేళ్ల కిందట చేపట్టిన ఒక హైలెవల్ వంతెన నిర్మాణం కాలగర్భంలో కలిసిపోతుంది. రూ.కోట్ల నిధులు వైరా నది పాలయ్యాయి. వైరా మండలంలోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిపై తొమ్మిదేళ్ల కిందట చేపట్టిన హైలెవల్ వంతెన నిర్మాణ దుస్థితి ఇది. స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ స్థలాల నుంచి తొమ్మిదేళ్ల నాడు చేపట్టిన వంతెన, అప్రోచ్ రోడ్డు నిర్మాణాలపై కొన్నినెలల కిందట దేవాదాయశాఖ అధికారులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారులకు ఒక వినతిపత్రం సమర్పించిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఈ నిర్మాణాలను రద్దు చేశారు. తిరిగి మళ్లీ ఇదే వంతెనకు కూతవేటు దూరంలో ఆలయ స్థలాల పైభాగంలో రోడ్డు, వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఇక అంతే యుద్ధప్రాతిపదికన కొత్త వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

2016లో తుమ్మల శంకుస్థాపన...

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి ఆర్ అండ్‌బీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 2016 జూలై 12వతేదీన సిరిపురం-స్నానాల లక్ష్మీపురం రహదారిలో 1/8-2/0వద్ద వైరా నదిలో హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.ఏడుకోట్ల నాబార్డు నిధులతో శంకుస్థాపన చేశారు. ఆవెంటనే అధికారులు టెండర్లు పిలిచి వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఆలయ స్థలం వైపు అబిట్‌మెంట్ అలాగే నదిలో ఏడు పిల్లర్లు పూర్తిగా, మూడు పిల్లర్లు భూమి పైభాగం వరకు నిర్మించారు. ఈ నిర్మాణానికి సంబంధించి రూ.కోట్లరూపాయల బిల్లులను చెల్లించారు. అయితే సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పలాయనం చిత్తగించాడు. సకాలంలో నిధులు ఇచ్చి ఉంటే ఎప్పుడో ఈ వంతెన, అప్రోచ్‌రోడ్డు నిర్మాణాలు పూర్తయి రాకపోకలు కూడా కొనసాగేవి. నిధుల లేమి కారణంగా తొమ్మిది సంవత్సరాల నుంచి ఈ వంతెన నిర్మాణం నత్తనడకగా నడిచింది. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్నానాల లక్ష్మీపురానికే చెందిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టడం జరిగింది.

నిధులు మంజూరు చేయించిన భట్టి

ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న భట్టి విక్రమార్క నాబార్డు నుంచి ఈ హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ వంతెన నిర్మాణానికి సంబంధించిన టెండర్లు ఆహ్వానించి తదితర ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలోనే 2014లో ఎన్నికలు రావడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం జరిగింది. ఆతర్వాత రెండేళ్ల పాటు ఈ హైలెవల్ వంతెన నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. అయినప్పటికీ నాడు మధిర ఎమ్మెల్యేగా ఉన్న భట్టి విక్రమార్క తనకున్న పరిచయాలతో హైలెవల్ వంతెన టెండర్లు పిలిచేలా నాడు ప్రభుత్వంలోని పెద్దలతో మాట్లాడి శంకుస్థాపన చేసేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆమేరకు నాటి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేసి పనులు కూడా చేపట్టారు.

కొత్త వంతెన నిర్మాణం...

ఇక వైరా నదిలో కలిసి పోనున్న అసంపూర్తి హైలెవల్ వంతెనకు పైభాగంలో కేవలం 20నుంచి30మీటర్ల దూరంలోనే వైరా నదిలో 130మీటర్ల పొడవుతో కొత్త వంతెన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో మాదిరిగా పిల్లర్ల నిర్మాణం కాకుండా ర్యాపిడ్ పద్ధతిలో ఈ వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ వంతెనకు రెండువైపులా రెండు అబిట్‌మెంట్లతో 130మీటర్ల పొడవుతో ఈ వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. సిరిపురం నుంచి స్నానాల లక్ష్మీపురం వరకు ఒకటిన్నర కిలోమీటర్ల సింగిల్ రోడ్డును రెండువరుసల రోడ్డుగా అలాగే వంతెనకు రెండువైపులా దాదాపు 500మీటర్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణం అలాగే స్నానాల లక్ష్మీపురం నుంచి గండగలపాడు మీదుగా సాయిబాబా మందిరం దగ్గరున్న జాతీయ ప్రధాన రహదారి వరకు ఐదుకిలోమీటర్లు సింగిల్ రోడ్డును రెండువరుసల నిర్మాణానికి రూ.30కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం కొత్తగా చేపట్టిన హైలెవల్ వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వైరా నదిలో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి డైవర్షన్ చేశారు. వర్షాకాలం నాటికి ర్యాపిడ్ పద్ధతిలో చేపట్టిన ఈ వంతెన నిర్మాణాన్ని నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా సకాలంలో పూర్తిచేసేలా ఆర్అండ్‌బీ అధికారులు పనులు చేయిస్తున్నారు.


వైరా నదిలో కలిసిపోనున్న నిర్మించిన ఫిల్లర్లు

రూ.కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు...

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తమ గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఫలితంగా కోట్లరూపాయల నిధులను మంజూరు చేయించారు. దాంతో ఆలయ స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే ఆలయ స్థలం మధ్యనుంచి వంతెన, అప్రోచ్ రోడ్డు వెళ్తుండటంతో అసంపూర్తిగా ఉన్న ఆనిర్మాణాలను నిలిపివేయాలని నిర్ణయించారు. దాంతో 2016లో మంత్రి తుమ్మల శంకుస్థాపన చేసిన ఈ వంతెన నిర్మాణానికి గ్రహణం పట్టింది. దీన్ని అసంపూర్తిగా వదిలేసి దాని పక్కనే హైలెవల్ వంతెన నిర్మాణాన్ని చేపట్టారు.

ఎదురుచూపులు ఇంకెన్నాళ్లో..

» బదిలీ కోసం ఎదురుచూస్తున్న ఎన్నికల కోసం వచ్చిన తహసీల్దార్లు
» 20 నెలలు గడచినా జరగని బదిలీలు » ఎంపీడీవోలది అదే పరిస్థితి



ఇతర జిల్లాల నుంచి..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో సొంత జిల్లా లేదా అలాటెడ్ జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేయడం సాధారణంగా జరిగే ప్రక్రియ. ఎన్నికలు ముగిసిన తరువాత ఏ జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్లను ఆయా జిల్లాలకు కేటాయించిన అనంతరం ఆయా జిల్లా కలెక్టర్లు వారికి మండలాలకు పోస్టింగ్ ఇస్తారు. ఇది ప్రతి ఎన్నికల సమయంలో జరిగే ప్రక్రియ.

సత్తుపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గత సాధారణ ఎన్నికల ముందు బదిలీపై వచ్చిన తహసీల్దార్లను 20 నెలలు గడుస్తున్నా వారి సొంత జిల్లాలు, లేదా అలాటెడ్ జిల్లాలకు బదిలీ చేయకపోవడంతో తహసీల్దార్లు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. తహసీల్దార్ల బదిలీలకు ఎంపీడీవోల బదిలీలు కూడా ముడిపెట్టంతో ఎంపీడీవోల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. బదిలీలపై ప్రభుత్వ పెద్దలు ఎప్పటికప్పుడు హామీలు ఇస్తున్నా, ప్రక్రియ ముందుకు సాగడం లేదని తహసీల్దార్లు పెదవి విరుస్తున్నారు.

2023 ఆగస్టులో బదిలీలు....

2023లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆగస్టు మొదటి వారంలో తహసీల్దార్లను వారు పని చేసే జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. రాష్ట్రంలో 400 మందికి పైగా తహసీల్దార్లను ఈ రకంగా వేరే జిల్లాలకు కేటాయించగా, పలు మండలాల్లో పోస్టింగులు ఇచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కూడా అన్ని మండలాల నుంచి తహసీల్దార్లను ఉమ్మడి వరంగల్ సహా ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తి అయిన తరువాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో వీరిని కొనసాగించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బదిలీ చేస్తారని ప్రచారం జరిగినా, పట్టించుకునే నాధుడే లేకపోవడంతో తహసీల్దార్లు సొంత జిల్లాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఎన్నికలు ముగిసిన తరువాత బదిలీలు చేయాల్సిన ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం పట్ల తహసీల్దార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలు దాటి వచ్చిన తమను తిరిగి పట్టించుకోకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వరకూ మాత్రమే అని ఇతర జిల్లాలకు వచ్చిన తమను తిరిగి బదిలీ చేయకపోవటం వల్ల కుటుంబాలను వదిలి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని అంటున్నారు. మరికొందరి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తాము సొంత జిల్లాలను వదిలి ఇతర జిల్లాలకు వచ్చి నెలలు గడుస్తున్నా బదిలీ చేయకపోడంతో పిల్లలను తీసికెళ్లాలంటే అక్కడే చదివిస్తే వారి స్థానికత కూడా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇక రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న తహసీల్దార్లను కూడా వారి సొంత జిల్లాలకు బదిలీలు చేయకపోవడంపై మానసిక వేదనకు గురవుతున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన సమయంలో రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న వారిని ఇద్దరు, ముగ్గురిని మాత్రమే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వారి సొంత జిల్లాలకు బదిలీ చేశారు. ఆ తరువాత ఇప్పటి వరకూ ఎవరినీ బదిలీ చేయకపోడంతో వారు పని చేసే జిల్లాల్లోనే రిటైరవుతున్నారు. దీంతో భవిష్యత్తులో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇతర పనుల నిమిత్తం సొంత జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు తిరగాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత వెంటనే అక్కడి ప్రభుత్వం తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపింది. కాని మన రాష్ట్రంలో మాత్రం 20 నెలల క్రితం జాయిన్ అయిన తహసీల్దార్లను మాత్రం బదిలీ చేయలేదు. బదిలీలు చేస్తే అర్థిక భారం పడే పరిస్థితి కూడా లేదు. సొంత జిల్లాలో పని చేయకూడదనే వాదనను తెరపైకి తెస్తున్నారని, కాని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తహసీల్దార్లు కొందరు సొంత జిల్లాకు చెందిన వారేనని గుర్తు చేస్తున్నారు. సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వకపోయినా కనీసం పక్క నియోజకవర్గంలో అయినా పోస్టింగ్ ఇచ్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని గుర్తు చేస్తున్నారు. ఏ శాఖలో లేని విధంగా స్థానికంగా ఉద్యోగం చేయకూడదనే అంశం తమకు ఎలా వర్తింపజేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికప్పుడు బదిలీలపై యూనియన్‌కు హామీలుస్తున్నా అమలు కావడం లేదని అంటున్నారు. తహసీల్దార్ల బదిలీకి సంబంధించి ఫైలు సీఎం వద్దకు చేరిందని ప్రచారం జరుగుతోంది. కాని శాఖా పరంగానే జరగాల్సిన బదిలీఫైలు ముఖ్యమంత్రి వరకూ అవసరం లేదని కొందరు వాదిస్తున్నారు. తహసీల్దార్ల బదిలీలు పెండింగ్‌లో ఉండగా దీనికి ఎంపీడీవోల బదిలీలు కూడా ముడిపెట్టటంతో వారి పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు.

గర్భస్రావాలకు అడ్డుకట్ట



» ఎంటీపీ చట్టం అమలుపై దృష్టి
» ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భస్రావాల నియంత్రణకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈమేరకు (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) ఎంటీపీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయటానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు ప్రకటించారు. వైద్యఆరోగ్య శాఖ నుంచి అనుమతి పొందిన వైద్యులు మాత్రమే ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసుకుని గర్భస్రావాలు చేయటానికి చట్టం వీలు కల్పిస్తోంది. నిబంధనలను వైద్యులందరూ అమలు చేయాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం ప్రకటించారు.

- జిల్లాలో ప్రస్తుతం ప్రైవేటు మహిళా వైద్యులకు కొదవలేదు. జిల్లా వ్యాప్తంగా 540 కి పైగా నర్సింగ్ హోంలున్నాయి. ఇందులో గైనకాలజిస్టులు 60 మంది వరకు ఉన్నారు. కొన్నాళ్లుగా వైద్యారోగ్య శాఖ అధికారులు నియంత్రణ మరిచి వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఎంటీపీ చట్టాన్ని వైద్యులు విస్మరించారు. గర్భస్రావాలను ఇష్టానుసా రంగా చేస్తున్నారు. వాస్తవానికి ఎంబీబీఎస్ వైద్యులు గర్భస్రావాలు చేసేందుకు అనర్హులు. స్త్రీ వైద్యంలో ప్రత్యేక నైపుణ్యం ఉన్నవారే అర్హులు. అయినా కొంతకాలంగా స్త్రీ వైద్యులందరూ యథేచ్ఛగా గర్భస్రావాలు చేస్తున్నారు. నెలలు నిండని వారి తోపాటు అనేక కారణాలతో సంతానం వద్దనుకునే గర్భస్రావాలకు అడ్డుకట సంతానం వద్దనుకునే వారికి కూడా గర్భస్రావాలు చేస్తున్నారు.

చట్టం అమలుకు చర్యలు

మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని యంత్రాంగం నిర్ణయించింది. ఈమేరకు జిల్లా వైద్యాధికారి మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఫలితంగా జిల్లాలో అతితక్కు ఆసుపత్రులు మాత్రమే గర్భస్రావాలు చేసే అవకాశం ఉంది. మిగిలిన స్త్రీ వైద్యులు గర్భస్రావాలు చేయటానికి అనర్హులవుతారు. దీంతోపాటు పాటు ప్రతీ నెలకు ఎన్ని గర్భస్రావాలు చేశారనే సమాచారం వైద్యశాఖకు సమర్పించాల్సి ఉంటుంది.

భ్రూణ హత్యలు చేస్తే కఠిన చర్యలు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భ్రూణహత్యలు జరగడానికి వీల్లేదని అలా చేసే సెంటర్లను వెంటనే ఆధారాలతో సీజ్ చేస్తామని, ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతీబాయి హెచ్చరించారు. మంగళవారం ఆమె ఛాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 0-5 వయస్సు గల ఆడపిల్లల నిష్పత్తి చాలా గణనీయంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడ మగ ఇద్దరూ సమానమేనని, ఇద్దరిని సమానంగా పెంచి పోషించాలన్నారు. లింగనిర్ధారణ, అబార్షన్లు చేస్తున్న సెంటర్లను బ్లాక్‌లిస్ట్ లో పెట్టి చట్టం ద్వారా శిక్షలు పడేలా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రోగ్రాం అధికారి డాక్టర్. సైదులు, గైనకాలజిస్ట్, హెచ్ఓడీ డాక్టర్. యామిని, జాగృతి ఎన్‌జీవో. ఇన్‌చార్జి కుమిదిని, డెమో వీ. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

వ్యక్తికి 16 నెలల జైలు

భద్రాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండలం చిన్ననల్లబెల్లి ప్రాంతం లో నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో యలగందుల పూర్ణచంద్రరావు మృతికి కారకులైన వర్కా మహేష్‌కు 16 నెలలు జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ మంగళవారం భద్రాచలం న్యాయాధికారి తీర్పు నిచ్చారు. 2014లో పూర్ణచంద్రరావు నల్లబెల్లి నుంచి చర్లకు వెళ్లి వస్తున్న క్రమంలో పక్కన ఆగి ఉండగా, ఎదురుగా అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనంతో మహేష్ ఢీకొట్టడంతో పూర్ణచంద్రరావు తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ క్రమంలో ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి నిందితుడు వర్కా మహేష్‌కు శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించారు.

అగ్ని ప్రమాదంలో మక్క పంట దగ్ధం


కాలి బూడిదైన మక్క కంకులు

బోనకల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని ఆళ్లపాడు రెవెన్యూ పరిధిలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో అల్లిక లక్ష్మీనారాయణకు చెందిన మక్క పంట పూర్తిగా దగ్ధమైంది. మూడు ఎకరాల భూమిలో మక్క పంటను సాగు చేశాడు. మిషన్ ద్వారా పట్టించిన పంటను ఇంటికి తోలాడు. పొలంలో కింద పడ్డ కంకులను ఏరించి ఒకచోట కుప్ప పోశాడు. దగ్గర భూమిలో చెత్తకు నిప్పు పెట్టడంతో గాలికి మంటలు అంటుకొని పంటతో పాటు 50 మోటారు పైపులు కాలి బూడిదయ్యాయి. దాదాపు 30 క్వింటాళ్ల మ క్కలు కాలిపోయాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ఇందుకు కారణమైన వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

నేడు అక్షయ తృతీయ

» గత ఐదేళ్లలో ఒక్క రోజులో రూ.6కోట్ల వ్యాపారం

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ వేడుకలను జిల్లా వ్యాప్తంగా మహిళలు ఘనంగా జరుపుకోనున్నారు. ఈ రోజు మహిళలు ఇండ్లలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్షయ తృతీయ రోజు బంగారం, వెడి వస్తువులు కొనుగోలు చేస్తే మంచిదనే భావన ఆనవాయితీగా వస్తుంది. దీంతో మహిళలు ఈ రోజు బంగారాన్ని కాని, వెండిని కొనుగోలు చేస్తుంటారు. కాగా ఈ ఏడాది బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో మహిళలు బంగారం కొనేందుకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటే వెండి రేట్లు అధికంగా పెరిగాయి. గత ఐదు ఏళ్లుగా 916 కేడీయం 10 గ్రాముల బంగారం రేట్లు 2020లో తులం బంగారం రూ.48,480, 2021లో రూ. 50,000, 2022లో రూ.53,000, 2023లో రూ.60,000, 2024లో రూ.80,000, 2025 ఏప్రిల్ 29న రూ, 90,400లుగా పెరుగుతూ పోతుంది. దీంతో గత ఐదేళ్లుగా అక్షయ తృతీయ రోజు 10కేజీల బంగారం అమ్ముడుపోతుందని, రూ.6కోట్ల వ్యాపారం జరుగుతుందని ఖమ్మం బులియన్ మార్కెట్ ప్రధాన కార్యదర్శి నకిరికంటి. రాధాకృష్ణ సతీష్ తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 400ల బంగారం, వెండి షాపులు(కార్పోరేట్ షాపులు కాకుండా) ఉన్నాయని, అందులో ఖమ్మం నగరంలో 140 షాపులు ఉన్నాయని తెలిపారు. తప్పనిసరి పరిస్థితులలో 10 తులాలు కొనేవారు, కేవలం తులంతోనే సరిపెట్టుకుంటున్నారని దీంతో వ్యాపారాలు బాగా తగ్గాయని అన్నారు. గతంతో పొల్చుకుంటే ఈ ఏడాది వెండి, బంగారం వ్యాపారాలు 40శాతం తక్కువగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది రేట్లు అధికంగా ఉండటంతో అక్షయ తృతీయ రోజు(బుధవారం) బంగారం, వెండి కొనుగోళ్లు అంతగా ఉండవని తెలుస్తుందని అన్నారు.



నేడు మహాత్మా బసవేశ్వర జయంతి: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మహాత్మాబసవేశ్వర జయంతిని బుధవారం ఉదయం కలెక్టరేట్ లో నిర్వహించు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 30న ఉదయం 9.00 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్థులు, కుల సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత: బీఆర్ఎస్



మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంమార్కెట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని దీంతోనే ప్రజలు, యువత రజతోత్సవ సభకు భారీగా తరలి వచ్చారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్ మాట్లాడారు.ఈనెల 27న హన్మకొండలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ భారీ స్థాయిలో సక్సెస్ అయినందున జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు కుళ్లుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు పసుమర్తి రామ్మోహన్, దండా జ్యోతిఅయ్యప్పరెడ్డి, బుర్రి వెంకట్‌కుమార్, నాయకులు తాజుద్దీన్ ఉన్నారు.

అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం ర్యాలీ

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం ఏర్పడి 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లాపరిషత్ సమావేశం మందిరంలో నిర్వహించిన సభలో ఆ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ మాట్లాడారు. అంబేద్కర్ ఆశయసాధనకు, రాజ్యాంగ పరిరక్షణకు దేశవ్యాప్తంగా అంబేద్కర్ చైతన్యబాట నిర్వహిస్తామని తెలిపారు. 1999లో అంబేద్కర ప్రజాసంక్షేమ సంఘాన్ని స్థాపించి అనేక సామాజిక సేవాకార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహించామని గుర్తు చేశారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి
- రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కలెక్టర్‌తో కలిసి అధికారులతో సమీక్ష


పథకాల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి, నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఖమ్మంలో తన నివాసంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ధాన్యం కొనుగోలు, భూభారతి చట్టం అమలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజనూ నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై కొనుగోలు చేయాలన్నారు. సన్నరకం వడ్లకు బోనస్ అందించాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి భూభారతి రైతు సదస్సుల ద్వారా నేలకొండపల్లి మండలంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి రెవెన్యూ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 20 రెవెన్యూ గ్రామాలకు ఇప్పటివరకు 2380 దరఖాస్తులు స్వీకరించామని, వీటిలో పరిష్కారం చూపేందుకు అవకాశం ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రతీ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ చేయాలన్నారు. బేస్మెంట్ వరకు పూర్తి చేసుకున్న నిర్మాణాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే లక్ష రూపాయలను ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డీఆర్డీవో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సివిల్ సప్లయిస్ డీఎంశ్రీలత, డీఏఓ పుల్లయ్య, డీసీవో గంగాధర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రాధాన్యం..

నేలకొండపల్లి: అభివృద్ధి సంక్షేమమే ప్రాధాన్యతగా ప్రజాప్రభుత్వం పాలన సాగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. మంత్రి పొంగులేటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాచేపల్లి గ్రామంలో కొత్తకొత్తూరు నుంచి ముదిగొండ మండలం వల్లభి వరకు రూ.40లక్షలతో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు.సుర్దేపల్లి నుంచి కిష్టాపురం వరకు రూ.35లక్షలతో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రోడ్లు,భవనాల ఎస్‌ఈయాకూబ్, ఈఈ యుగంధర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

నిఘావర్గాల ఆదేశాలతో పరిశీలన



ఖమ్మంక్రైం, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో మంగళవారం రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ బుర్రా సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ సురేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రయాణీకులు, రైల్వేఆస్తులు కాపాడడం, భద్రతాచర్యలు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ఇటీవల ఉగ్రవాదులు దాడుల నేపథ్యంలో రైల్వేశాఖ ఆస్తులు ధ్వంసం చేసే కుట్ర జరుగుతోందని కేంద్రనిఘా వర్గాల సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం తనిఖీలు చేపట్టినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ మోడిష్నా, ప్రసన్నకుమార్, రమేష్, రామారావు,మదన్,మహేష్, పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ల సమస్యకు త్వరలో పరిష్కారం

మంత్రి పొంగులేటి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల సమస్యను త్వరలోనే పరిష్కారం చూపుతామని సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. పలువురు జర్నలిస్టులు మంగళవారం సాయంత్రం ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియం వద్ద వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టీయూడబ్ల్యుజేయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు మాటేటి వేణుగోపాల్, యూనియన్ జిల్లా నాయకుడు నలజాల వెంకటరావు, మామిడాల భూపాల్‌రావు, మైనుద్దీన్, జనార్ధన్‌చారి, చెరుకుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

- తొలగించిన రెవెన్యూ అధికారులు


అక్రమ కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ఖమ్మంరూరల్,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి అందులో అక్రమ కట్టడాలు నిర్మిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు రూరల్ తహసీల్దార్ పిల్లి.రాంప్రసాద్, ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలోని ప్రభుత్వభూమి 142 సర్వే నంబర్‌లో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్, కమిషనర్ ఆధ్వర్యంలో ఆర్ఐ ప్రసాద్ అక్రమ కట్టడాలను కూల్చివేశారు.కొంతమంది ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు ఇప్పిస్తాం అని చెప్పి అమాయక ప్రజలవద్ద డబ్బులు తీసుకుని ప్రభుత్వ భూములను చూపించి ఇళ్లుకట్టుకోవాలని సూచిస్తున్నారని, అలాంటివారిని ప్రజలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఇళ్లజాగాలేని నిరుపేదలు రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే ఇళ్లస్థలాలు ఇచ్చే సమయంలో వారికి న్యాయం చేస్తామని చెప్పారు.ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మెడికల్ కళాశాలలో కొవ్వొత్తులతో ర్యాలీ



ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి అమానుషమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు అన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ మంగళవారం ఖమ్మంలో మెడికల్ కళాశాలలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పర్యాటకులపై కులం, మతం పేరుతో దాడిచేసి చంపడాన్ని ఖండించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, ప్రొఫెసర్లు సృజన, సదానందం, సమతరాణి, కళ్యాణిశ్రీనివాసబాబు, ధర్మేంద్ర, దివ్యదర్శిని, ఆఫీస్ సూపరిన్‌టెండెంట్స్, నాన్‌టీచింగ్ సిబ్బంది, సీనియర్ రెసిడెన్స్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి


ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంరూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ సీపీఎం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో రూరల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేకుండా అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్నవారిని ఎంపిక చేయడం దుర్మార్గం అన్నారు. భూములు, ఇంతకుముందే ఇళ్లు ఉన్నవారిని లబ్ధిదారులుగా కేటాయించడం మంచి పద్ధతి కాదన్నారు. అర్హులైన వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. పోలేపల్లి గ్రామంలో పేద రైతుల భూములు లాక్కోవాలని చూస్తే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో సుమారు 150 మంది ఇళ్లు కోల్పోయారని వారికి ఎటువంటి హామీ ఇవ్వకపోగా ఆ 150 మందికి లాభం చేకూరుస్తామని అధికార పార్టీ నాయకుడు ఒక్కొక్కరి దగ్గర రూ.20వేలు వసూల్ చేయడం సిగ్గు మాలినచర్యల అన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెంట్‌పద్మావతికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నండ్రా ప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సంగయ్య, మోహన్‌రావు, జక్కంపూడి కృష్ణ, వట్టికోటి నరేష్, అరవింద్, నాగరాజు, కొండం కరుణాకర్ పాల్గొన్నారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం

కాంట్రాక్ట్ అధ్యాపకులు



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దొడ్డి దారిన తెచ్చిన జీవో నెంబర్ 21ని ఉపసంహరించుకునేంత వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని కాంట్రాక్ట్ అధ్యాపకులు హెచ్చరించారు. మంగళవారం నగరంలోని పీజీ,పీడీకళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో 11రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లతరబడి విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను శాశ్వత ప్రాతిపాదికన క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రత కల్పించకుండా జీవో నెంబరు 21 తెచ్చి తమ జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చారన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులుటి.గోపి,ఎం.శ్యాంబాబు, ఎ.వీరన్న, కోటి, రవిబాబు, లక్ష్మీ, హరిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కన్నుమూత



నేలకొండపల్లి, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): చెర్వుమాధారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త తెల్లగొర్ల అర్జున్(75) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుని కుమారుడు తెల్లగొర్ల లింగస్వామి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. బీఆర్ఎస్ నాయకులు, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ సభ్యులు నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా అస్తవ్యస్తం

జడ్పీ మాజీ చైర్మన్ లింగాల

బోనకల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని ఇందిరమ్మ కమిటీల పేరుతో నేటి ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక జాబితాలను అస్తవ్యస్తంగా చేపట్టిందని మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో మంగళవారం ఆ పార్టీ నాయకుడు పారా ప్రసాద్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది తరలి వచ్చినందుకు గాను వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, సభ విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎంగా కేసీఆర్ పాలన చేపట్టనున్నారని ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు, పోలీసులు గుర్తుంచుకోవాలని సూచించారు. కేసీఆర్ ప్రసంగంలో కమీషన్ల ప్రస్తావన వీడియోలను సోషల్ మీడియాలో పెట్టిన వారిని పోలీసులు బెదిరించడం సరికాదన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ఇచ్చిన ఏ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించి, వారిని అణగ దొక్కాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్లు బంధం శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, వేమూరి ప్రసాద్, చేబ్రోలు మల్లికార్జున్, మోదుగు నాగేశ్వరరావు, గద్దల వెంకటేశ్వర్లు, కాకాని శ్రీను, యంగల కనకయ్య పాల్గొన్నారు.

కల్లూరు సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం


కల్లూరులో సెంట్రల్ లైటింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

కల్లూరు,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణం మునిసిపాలిటీగా రూపాంతరం చెందినందున త్వరలో సెంట్రల్ లైటింగ్ వెలుగుల కళ రానున్నది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లా పంచాయితీ అధికారి ఆశాలత మంగళవారం కల్లూరులోని ప్రధాన సెంటర్‌లో నిరుపయోగంగా గల సెంట్రల్ లైటింగ్ స్థంభాల ప్రదేశాన్ని పరిశీలించారు. కల్లూరు మేజర్ పంచాయితీగా ఉండగా గతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో ప్రభుత్వం తరుపున సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆ తరువాత ప్రభుత్వాలు మారటంతో ఆర్థిక భారంతో కల్లూరు సెంట్రల్ లైటింగ్ వెలుగునివ్వని పరిస్థితి. ఈ సమస్య గత 35 సంవత్సరాలుగా నుంచి మరుగన పడింది. లక్షలాది రూపాయిల వెచ్చించిన ఫలితం లేక పోయింది. దీంతో కల్లూరు మునిసిపాలిటీగా మారటంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రత్యేక దృష్టి సారించి కల్లూరులో సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఆ క్రమంలోనే డిపిఓ ఆశాలత, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఈవో నాగేశ్వరరావులు కలిసి సదరు ప్రదేశాన్ని వారు సందర్శించి తగిన సూచనలు చేశారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు గతంలో ఏర్పాటు చేసిన స్థంబాలు ఎన్ని వాటి పరిస్థితిపై వివరాలతో తగిన అంచనాలు రూపొందించి నివేదిక పంపాలని డిపీఓ వారికి ఆదేశించారు. దీంతో ఎంతో కాలంగా కల్లూరు పట్టణంలో సెంట్రల్ లైటింగ్ కోసం ఎదరు చూస్తున్న పట్టణ వాసుల కల నెరవేరే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆందోళన

ముదిగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన తమకు ఇళ్లు కేటాయించకుండా అనర్హుల పేర్లను ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చారని ఆరోపిస్తూ మంగళవారం ముదిగొండ మండలం వనంవారిక్రిష్టాపురం సెక్రటరీ, సిబ్బందిని పంచాయతీ కార్యాలయంలో ఉంచి తాళం వేసి పలువురు మహిళలు నిరసన తెలిపారు. అర్హులైన తమకు ఇళ్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పండ్రేగుపల్లి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన పేర్లనే తుది జాబితాలో చేర్చారని, అనర్హులకు ఇళ్లు కేటాయించారని నిరసన వ్యక్తం చేస్తూ ముదిగొండ మండలపరిషత్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలని వారు ఎంపీడీవో శ్రీధర్‌స్వామికి వినతిపత్రం అందజేశారు.

సర్వేను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

కొణిజర్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో ఇందిరమ్మ కమిటి ఆధ్వర్యంలో ఎంపిక చేసిన లబ్దిదారుల అర్హుల లిస్టును గెజిటెడ్ అధికారులు లబ్దిదారుల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నారు. మంగళవారం ఆ గ్రామంలో జరుగుతున్న సర్వేను అడిషనల్ కలెక్టర్ శ్రీజ అకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే జరుగు విధానంను ప్రత్యేకాధికారిని అడిగి తెలుసుకున్నారు. సర్వే పకడ్బందీగా ఉండాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోజారాణి, ప్రత్యేకాధికారి మనోజా, పంచాయతీ కార్యదర్శి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీవో రాజేంద్రగౌడ్

పెనుబల్లి, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం రైతులకు ఎంతో ఉపయోగకరమైన చట్టమని దీన్ని సన్న చిన్నకారు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ సూచించారు. మంగళవారం పెనుబల్లిలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆర్డీవో పాల్గొని ప్రసంగించారు. ఈ చట్టం ప్రకారం రైతులకు గతంలో కానీ పనులు ఈ చట్టంలో చేసుకోవచ్చునని, సాదాబైనామా తదితర భూసమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం కింద 48మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, కల్లూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రావబోయిన కోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పొట్లపల్లి వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు పసుమర్తి విశ్వనాథ్, రాధాకృష్ణ, చిన్ననర్సింహారావు, చీకటి రామారావు పాల్గొన్నారు.



ఎరువుల స్టాక్ పాయింట్ ప్రారంభం

చింతకాని, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో రైతుల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన ఎరువుల స్టాకు పాయింట్‌ను జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య ప్రారంభించారు. సీఐఎల్ ఫర్టిలైజర్ కంపెనీకి చెందిన 20:20:0:13 ఫర్టిలైజర్ 1300 టన్నులు వచ్చాయి. రైతులకు పంపిణీ చేశారు. స్టాక్ పాయింట్‌ను రైతుల అవసరాల కోసం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఏవో మానస, టెక్నికల్ ఏవో పవన్ కుమార్, కంపెనీ సేల్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

కొణిజర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో ఇందిరమ్మ కమిటి ఆధ్వర్యంలో ఎంపిక చేసిన లబ్దిదారుల అర్హుల లిస్టును గెజిటెడ్ అధికారులు లబ్దిదారుల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నారు. మంగళవారం ఆ గ్రామంలో జరుగుతున్న సర్వేను అడిషనల్ కలెక్టర్ శ్రీజ అకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే జరుగు విధానంను ప్రత్యేకాధికారిని అడిగి తెలుసుకున్నారు. సర్వే పకడ్బందీగా ఉండాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోజారాణి, ప్రత్యేకాధికారి మనోజా, పంచాయతీ కార్యదర్శి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం

కల్లూరు, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణం మునిసిపాలిటీగా రూపాంతరం చెందినందున త్వరలో సెంట్రల్ లైటింగ్ వెలుగుల కళ రానున్నది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లా పంచాయితీ అధికారి ఆశాలత మంగళవారం కల్లూరులోని ప్రధాన సెంటర్‌లో నిరుపయోగంగా గల సెంట్రల్ లైటింగ్ స్థంబాల ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. కల్లూరు మేజర్ పంచాయితీగా ఉండగా గతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో ప్రభుత్వం తరుపున సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆ తరువాత ప్రభుత్వాలు మారటంతో ఆర్థిక భారంతో కల్లూరు సెంట్రల్ లైటింగ్ వెలుగునివ్వని పరిస్థితి. ఈ సమస్య గత 35 సంవత్సరాలుగా నుంచి మరుగన పడింది. లక్షలాది రూపాయిల వెచ్చించిన ఫలితం లేక పోయింది. దీంతో కల్లూరు మునిసిపాలిటీగా మారటంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రత్యేక దృష్టి సారించి కల్లూరులో సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఆ క్రమంలేనే డిపిఓ ఆశాలత, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఈవో నాగేశ్వరరావులు కలిసి సదరు ప్రదేశాన్ని వారు సందర్శించి తగిన సూచనలు చేశారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు గతంలో ఏర్పాటు చేసిన స్థంబాలు ఎన్ని వాటి పరిస్థితిపై వివరాలతో తగిన అంచనాలు రూపొందించి నివేదిక పంపాలని డిపీఓ వారికి ఆదేశించారు. దీంతో ఎంతో కాలంగా కల్లూరు పట్టణంలో సెంట్రల్ లైటింగ్ కోసం ఎదరు చూస్తున్న పట్టణ వాసుల కల నెరవేరే ఆవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆందోళన

ముదిగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన తమకు ఇళ్ల కేటాయించకుండా అనర్హుల పేర్లను ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చారని ఆరోపిస్తూ మంగళవారం ముదిగొండ మండలం వనంవారిక్రిష్టాపురం సెక్రటరీ, సిబ్బందిని పంచాయతీ కార్యాలయంలో ఉంచి తాళం వేసి పలువురు మహిళలు నిరసన తెలిపారు. అర్హులైన తమకు ఇళ్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పండ్రేగుపల్లి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన పేర్లనే తుది జాబితాలో చేర్చారని, అనర్హులకు ఇళ్లు కేటాయించారని నిరసన వ్యక్తం చేస్తూ ముదిగొండ మండలపరిషత్ కార్యాలయం ఎదుట గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఇందిరమ్మ కమిటీలను రద్దుచేసి అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలని వారు ఎంపీడీవో శ్రీధర్‌స్వామికి వినతిపత్రం అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా అస్తవ్యస్తం

- ఆరు గ్యారంటీల అమలు పై శ్రద్ధ పెట్టాలి
- విలేకరుల సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల

బోనకల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని ఇందిరమ్మ కమిటీల పేరుతో నేటి ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక జాబితాలను అస్తవ్యస్తంగా చేపట్టిందని మాజీ జడ్పీ ఛైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో మంగళవారం ఆ పార్టీ నాయకుడు పారా ప్రసాద్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది తరలి వచ్చినందుకు గాను వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, సభ విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎంగా కేసీఆర్ పాలన చేపట్టనున్నారని ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు, పోలీసులు గుర్తుంచుకోవాలని సూచించారు. కేసీఆర్ ప్రసంగంలో కమీషన్ల ప్రస్తావన వీడియోలను సోషల్ మీడియాలో పెట్టిన వారిని పోలీసులు బెదిరించడం సరికాదన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ఇచ్చిన ఏ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించి, వారిని అణగ దొక్కాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్లు బంధం శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, వేమూరి ప్రసాద్, చేబ్రోలు మల్లికార్జున్, మోదుగు నాగేశ్వరరావు, గద్దల వెంకటేశ్వర్లు, కాకాని శ్రీను, యంగల కనకయ్య, ఎ. శ్రీనివాసరావు, బి. బాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు సొంత భవనాలు కరువు

అద్దె భవనాలు, పాతభవనాల్లో విధులు నిర్వహణ

నిర్మాణంలో పలు పంచాయతీ భవనాలు



అద్దె భవనంలో నడుస్తున్న మేకాలకుంట పంచాయతీ భవనం

కొణిజర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీలకు సొంతభవనాలు కరువయ్యాయి. ఫలితంగా పంచాయతీ నిర్వాహణకు సంబంధించిన కార్యకలాపాలన్ని అద్దె భవనాలు, పాతభవనాల్లో నడిపిస్తున్నారు. ఏళ్ల గడుస్తున్న కొన్ని గ్రామ పంచాయతీలు పూర్తికాలేదు. మరికొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. కొణిజర్ల మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీకి సొంత భవనం ఉండాల్సి ఉండగా కొన్ని పంచాయతీలకు భవనాలు కరువయ్యాయి. మండల పరిధిలోని మేకాలకుంట, రాజ్యాతండా, గద్దలగూడెం, అంజనాపురం, అన్నవరం పంచాయతీలకు సొంత భవనాలు లేవు. రామనర్సయ్యనగర్, తుమ్మలపల్లి, గ్రామాలలోని పంచాయతీ భవనాలు నిర్మాణం చివరి దశలో ఉన్నాయి. గోపవరం మరికొన్ని పంచాయతీలకు పాత భవనాల్లోనే నడిపిస్తున్నారు. వైరా మునిసిపాలిటి పల్లిపాడు గ్రామంలో పంచాయతీ భవనం నిరుపయోగంగా ఉంది. మేకాలకుంట వంటి పంచాయతీకి అద్దె భవనంలో నడిపిస్తుండటం, ఆ భవనం పూర్తిగా శిథిలంలో ఉంది. తలుపులు కూడ సక్రమంగా లేవు. పంచాయతీకి సంబంధించిన విలువైన రికార్డులను ఎక్కడ భద్రపరుస్తారోనని ప్రజల్లో సందేహం వ్యక్తం అవుతుంది. పంచాయతీ సమావేశాలను కూడ ఆయా గ్రామ పంచాయతీలలో నిర్వహించటానికి స్థలం కూడ సక్రమంగా లేదు. పంచాయతీ కార్యదర్శులు అద్దె భవనాల్లో విధులు నిర్వహించటం కష్టంగా ఉన్న బయటకు మాత్రం చెప్పలేకపోతున్నారు. ఉన్న పంచాయతీ భవనాల్లోనే విధులు నిర్వహిస్తూ వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు సొంతభవనాలు లేని పంచాయతీలను పరిశీలించి కొత్తభవనాలను మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనాలు ఉండేలా చూస్తున్నాం

రోజారాణి, ఎంపీడీవో

మండలంలో ఒకటి, రెండు తప్పా అన్ని గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉన్నాయి. తుమ్మలపల్లి, రామనర్సయ్యనగర్ వంటి గ్రామాలలో కూడ పంచయాతీ భవనాలు పూర్తి అవుతున్నాయి. రాజ్యాతండాలో స్థలం చూడటం జరిగింది. మేకాలకుంట పంచాయతీ అద్దెభవనంలో నడుస్తుంది దానికి సంబంధించిన తులుపులు వంటి వస్తు సామాగ్రిని పరిశీలిస్తాం. గద్దలగూడెం పంచాయతీకి మాత్రం మంజూరిలో పంచాయతీ భవనంలేదు. అన్ని పంచాయతీలలో ఇబ్బందులు లేకుండ పంచాయతీ కార్యాకలాపాలకు సంబందించి విధులను సక్రమంగానే నిర్వహిస్తున్నారు. ఇబ్బంది ఉన్న దగ్గర సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తాం.



ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుక్కింకొండ వినోద్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

'భూ భారతి'తో భూములకు రక్షణ కవచం

భూ భారతి సదస్సులో ఎమ్మెల్యే మాట్టా రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం రైతుల భూములకు రక్షణ కవచం లాంటిదని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరులో మంగళవారం రెవెన్యూశాఖ తరపున భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి ప్రసంగించారు. రైతులందరు భూ భారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని అప్పడే భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. భూ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొవచ్చిందని, ఈ చట్టంతో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించుకోవచ్చునన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ధరణి చట్టంతో రైతుల భూముల తారుమారైనాయని అన్నారు. దుర్మార్గంగా పాలన సాగించి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి మేలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కేసీఆర్ వరంగల్ సభలో తెలంగాణాను చూస్తే తన గుండే మండుతుందని అన్నారని ఎమ్మెల్యే రాగమయి ఎద్దేవా చేశారు. ధరణీలో లోపాలను సరి చేసే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేధో మదనం చేసి భూ భారతి చట్టం తీసుకు రావటం జరిగిందన్నారు. గతంలో ఏమైన భూ సమస్యలు వస్తే కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని రాగమయి అన్నారు. భూ భారతితో 90 శాతం తహసిల్దార్ వద్దే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డిఓ ఎల్ రాజేంద్రగౌడ్ మాట్లాడతూ భూ భారతి చట్టంపై సమగ్రంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు, బాగం ప్రభాకరచౌదరి, తోటకూర శేషగిరిరావు, పసుమర్తి మోహన్‌రావు, సీడీసీ చైర్మన్ కస్తాల నరేంద్ర, తహసీల్దార్ సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ ఆదర్శప్రాయుడు: సీఈవో



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

ఏన్కూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విధినిర్వాహణలో నీతి, నిజాయితీ నిబద్ధత, అంకితభావంతో ప్రజలకు సేవలందించిన ఎంపీడీవో రమేష్ ఆదర్శప్రాయుడని జడ్పీ సీఈవో దీక్షారైనా అన్నారు. స్థానిక సాయితాగూర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఎంపీడీవో రమేష్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలు చేసి మన్ననలు పొందాలన్నారు. ప్రజాసేవలోనే సంతృప్తి కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో డీపీవో ఆశాలత, డీఎల్‌పీవో రాంబాబు, వ్యవసాయశాఖ వైరా ఏడీ కరుణశ్రీ, తహసీల్దార్ శేషగిరిరావు, జూలూరుపాడు ఎంపీడీవో కరుణాకరరెడ్డి, ఏవో నరసింహారావు, పంచాయతీ రాజ్ ఏఈ అనూష, మిషన్‌భగీరథ ఏఈలు రోహిత్, కిషోర్, ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, ఈజీఎస్ ఏపీవో సూరయ్య, సూపరింటెండెంట్ తుమ్మలపల్లి కృష్ణ, ఏపీవో జీపీఎస్ నారాయణ, హెచ్ఎం కూరాకుల సైదయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, సీపీఎంపార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, వాసిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర జూనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికైన న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థి



వేణును అభినందిస్తున్న భీమేశ్వరరావు

వైరా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర జూనియర్ కబడ్డీ జట్టుకు ఖమ్మం జిల్లా వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థి ఎక్కిరాల వేణు అభినయ్ ఎంపికయ్యాడు. ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న జరిగిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలుర జట్టుకు వేణు అభినయ్ ఎంపికయ్యాడని ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరపున నాగపూర్‌లో అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వేణు అభినయ్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయస్థాయిలో కూడా చక్కని ప్రతిభ కనపర్చి ఆజట్టుకు ఎంపిక కావాలని డాక్టర్ భూమేశ్వరరావు ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన కోరారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ వేణు ప్రతిభ చూపాలని ఆయన ఆకాంక్షించారు. అక్కడ సైతం ప్రతిభ చూపాలని కోరారు. వేణు అభినయ్‌ను భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ఏవో ఎస్.నర్సింహారావు, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ అభినందించారు.

అధికారులకు రాజశేఖర్‌నగర్ వాసుల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీ వాసులు

వైరా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 9వ వార్డు పరిధిలో సైదులుదర్గా వద్ద మధిర-జగ్గయ్యపేట రోడ్డులో కల్వర్టు స్థానంలో డ్రెయినేజీని నిర్మించి మురుగునీటి సమస్య నుంచి తమకు విముక్తి కల్పించాలని ఆవార్డులోని రాజశేఖర్‌నగర్‌కు చెందిన ప్రజలు మునిసిపల్ అధికారులను కోరారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో ఈ సమస్యపై ఒక వినతిపత్రం సమర్పించారు. రూ.12కోట్లతో వైరా-మధిర, జగ్గయ్యపేట ఆర్అండ్‌బీ రోడ్డును అభివృద్ధి చేస్తున్న దానిలో భాగంగా సైదులుదర్గా వద్ద గతంలో ఉన్న కల్వర్టును పునర్నిర్మిస్తూ పల్లపు ప్రాంతమైన తమ ఇళ్లపైకి మురుగునీరు వచ్చేలా చేస్తున్నారని పేర్కొన్నారు. అలా కాకుండా రోడ్డుకు రెండువైపులా డ్రెయినేజీని నిర్మించి మురుగునీరు ఆడ్రెయినేజీ ద్వారా వాగులోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కల్వర్టును నిర్మించి సుందరయ్యనగర్, లీలాసుందరయ్యనగర్ ప్రాంతాల్లోని మురుగునీటిని సైదులుదర్గా వైపు వదిలితే తాము నివసించలేని దుస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగునీరు బయటకు వెళ్లేం అవకాశం లేకుండా ఉందని ఫలితంగా పరిసరాలన్నీ అధ్వానంగా మారాయని వివరించారు. అందువలన కల్వర్టు స్థానంలో డ్రెయినేజీని నిర్మించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సోమవారం ఈ కల్వర్టు నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకొని ఇదే సమస్యపై మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీవో రాజేంద్రగౌడ్



వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీ వాసులు

పెనుబల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం రైతులకు ఎంతో ఉపయోగకరమైన చట్టమని దీన్ని సన్న చిన్నకారు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ సూచించారు. మంగళవారం పెనుబల్లిలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆర్డీవో పాల్గొని ప్రసంగించారు. ఈ చట్టం ప్రకారం రైతులకు గతంలో కానీ పనులు ఈ చట్టంలో చేసుకోవచ్చునని, సాదాబైనామా తదితర భూసమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం కింద 48మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, కల్లూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాచబోయిన కోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పొట్లపల్లి వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు పసుమర్తి విశ్వనాథ్, రాధాకృష్ణ, చిన్న నర్సింహారావు, చీకటి రామారావు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

ముదిగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాంటాలు వేసి వెంటనే మిల్లులకు తరలించాలని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ ఐకేపీ సిబ్బందికి సూచించారు. గోకినపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తారని రైతులు తహసీల్దార్ తెలపడంతో మంగళవారం ఆకొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాంటాలు వేసి వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగారంలో విద్యార్థినికి సన్మానం

సత్తుపల్లి, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాలలో 993(1000)మార్కులు సాధించిన గంగారం గ్రామానికి చెందిన గోళ్ల కళాధర్ కుమార్తె జ్యోతి అమూల్యను వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్వగ్రామంలో సన్మానించారు. కార్యక్రమంలో మల్లారి సత్యనారాయణ, సరబు శివనాథ్, ప్రభు, గోళ్ల ప్రసాద్ అడపా రవికుమార్ పాల్గొన్నారు.

నీటిఎద్దడి లేకుండా చూడండి

కారేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేసవికాలన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడిలేకుండా చూడాలని ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్ అన్నారు.మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షసమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి రోజు పంచాయతీ పరిధిలో పర్యటిస్తు మంచినీటి పథకాలకు సంబందించిన వాటిని పరిశీలనచేయాలని సూచించారు. చేతి పంపులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేల చూడాలన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

కారేపల్లి ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో అర్హులైనప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు మంగళవారం వినతిపత్రాలు అందించారు. గ్రామానికి చెందిన పలువురు ఎంపీడీవో సురేందర్, స్థానిక గ్రామపంచాయతీ కార్యాదర్శికి వినతిపత్రాలు అందచేశారు.ఈసందర్భంగ గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో అనేక మందినిరుపేదలు ఉన్నారని, వారిలో అర్హులైనవారిని ఎంపీక చేసి ఇల్లు మంజూరుచేయాలని కోరారు.

రేపటినుంచి వేసవి క్రీడా శిబిరం

ఏన్కూరు, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మే 1నుండి జూన్ 6వరకు తిమ్మరావుపేట గ్రామంలో ఓం ఆదిత్యగాయత్రి పాఠశాలలో వేసవి కబడ్డీశిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంఈవో రహీంబీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు బ్యాటరీ టెస్టులపై కూడా శిక్షణ ఇవ్వన్నునట్టు తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డీఎస్‌వో సునిల్‌రెడ్డి ఆదేశాలతో క్యాంపునిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ధృఢత్వం కలుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు వివరాలకు క్యాంప్ ఇన్‌చార్జి శోభన్, సలీం, రమేష్‌లను సంప్రదించాలన్నారు.

రెండు కుట్టుమిషన్ల వితరణ

వైరా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇద్దరు పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. లగడపాటి ప్రభాకర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని వైరాకు చెందిన వేముల వెంకటలక్ష్మీ, పతంగి మౌనికకు డాక్టర్ కాపా మురళీకృష్ణ కుట్టుమిషన్లు అందజేశారు. అనంతరం ప్రభాకర్‌రావు జన్మదిన వేడుకల కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉండ్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, గంగవరపు కిషన్, తోటకూర శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, మరికంటి రాంగోపాల్, చింతోజు నాగేశ్వరరావు, రామారావు, పుల్లారావు, రామకృష్ణ, రాజారావు, గోపి పాల్గొన్నారు.

ఆటోయూనియన్ కార్యవర్గం ఎన్నిక

వైరా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైరా డివిజన్ ఆటోవర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. నాగూల్‌మీరా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో నాగూల్‌మీరా, రాజశేఖర్ తలపడ్డారు. రాజశేఖర్‌పై 19ఓట్ల మెజార్టీతో నాగూల్‌మీరా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు బుగ్గవరపు నాగేశ్వరరావు, పాలెం వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఎన్నిక అనంతరం ఆటోయూనియన్ నాయకులు బుక్కాలు చల్లుకొని సంబరాలు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో షేక్.అష్రన్, సీహెచ్.కృష్ణయ్య, లక్ష్మణ్‌రావు, రవి, రాము, అన్వర్, సోందు, బాషా, సాయి, షరీఫ్, నాగూల్‌మీరా పాల్గొన్నారు.

నేడు మైనార్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

మధిరటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ బుధవారం మధిర లో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా మధిర మార్కెట్ యార్డులో ముస్లీం ఐక్యవేదిక ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లీంలు నిర్వహిస్తున్న సభలో పాల్గొని ఆయన ప్రసంగించనున్నారు.